క్లుప్తంగా

'ముఖాముఖి'తో సమస్యలు పరిష్కారం


సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

పటాన్‌చెరు టౌన్: ప్రజలతో ముఖాముఖి కార్యక్రమం (పబ్లిక్ కాంట్రాక్ట్ ప్రోగ్రాం)తో ఆయా కాలనీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని జీహెచ్ఎంసీ డీఈ క్రాంతి అన్నారు. సోమవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని చైతన్యనగర్ కాలనీలోని బాబు జగ్జీవన్ ఫంక్షన్ హాల్‌లో కాలనీవాసులతో కలిసి అధికారులు పబ్లిక్ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు తమ సమస్యలను అధికారులకు వివరించగా స్పందించిన అధికారులు సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో కాలనీవాసులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం


శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి అన్నారు. బొల్లారం మున్సిపల్ పరిధిలోని 12వ వార్డులో సోమవారం యూజీడీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని అన్ని కాలనీలను అభివృద్ధి చేసేందుకు దశలవారీగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బాలమణి, నాయకులు రత్నం పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్ సందర్శన

కొండాపూర్(సంగారెడ్డి): అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా బీజేపీ సీనియర్ నాయకుడు కొండాపురం జగన్ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు సోమవారం సంగారెడ్డిలోని ఎస్సీ హాస్టల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు అశ్వంత్, జిల్లా ప్రధాన కార్యదర్శి అప్రాధి ఎల్లయ్య ఉపాధ్యక్షులు రవీందర్ కోశాధికారి బుచ్చప్ప, అవస్, సురేష్, మురారి, శివకుమార్ పాల్గొన్నారు.

ఆర్టిజన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

జిన్నారం(పటాన్‌చెరు): విద్యుత్ ఉప కేంద్రాలు, ఇతర విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని హెచ్–82 యూనియన్ డివిజన్ అధ్యక్షుడు రఘు, కార్యదర్శి మౌలానా డిమాండ్ చేశారు. ఆర్టిజన్ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం జిన్నారం, గుమ్మడిదల మండలాల్లోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ల వద్ద విద్యుత్ ఆర్టిజన్‌లు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 23వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించినా ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవటం విచారకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం సమ్మె వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సాయి గౌడ్, శ్రీశైలం, సుధాకర్, మురళి, శ్రీకాంత్, నవీన్‌చారి, నాగేందర్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులను పర్మనెంట్ చేయాలి

కొండాపూర్(సంగారెడ్డి): జూనియర్ పంచాయతీ కార్యదర్శులను పర్మనెంట్ చేయాలని ఆ సంఘం అధ్యక్షుడు కిషోర్ డిమాండ్ చేశారు. సోమవారం టీపీఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ నిర్ణయించిన కార్యాచరణలో భాగంగా సీఎం కేసీఆర్‌కు రెగ్యూలరైజ్ చేయాలని కోరుతూ అడ్రస్ చేస్తూ పోస్ట్ కార్డుల ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ ప్రొహిబెషన్ పీరియడ్ ముగిసినప్పటికీ నేటికీ పర్మినెంట్ చేయకపోవడం బాధాకరమన్నారు. ఈ నెల 28 లోపు ప్రభుత్వం నుంచి స్పందన రాకపోతే నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. టీపీఎస్ఎఫ్ కొండాపూర్ మండల ఉపాధ్యక్షులు వనజ, జనరల్ సెక్రెటరీ రజిని కోశాధికారి లోకేష్, మహిళా కన్వీనర్ లావణ్య పాల్గొన్నారు.

విద్యుత్‌కు అంతరాయం ఏర్పడితే సమాచారం ఇవ్వండి

జహీరాబాద్: విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న హెచ్–82, ఇత్తెహాద్ యూనియన్లకు సంబంధించిన ఆర్టిజన్‌లు సమ్మెకు వెళుతున్నందునా ఎక్కడైనా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే సమాచారం ఇవ్వాలని డీఈఈ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఈనెల 25వ తేదీ నుంచి సమ్మెకు వెళుతున్నట్లు నోటీసు ఇచ్చారన్నారు. విద్యుత్ లైన్లకు నష్టం కలిగిస్తే పోలీసులకు, తమ శాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఆరోపణలు చేస్తే సహించేదిలేదు

పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి


పటాన్‌చెరు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: బీఆర్ఎస్ చేస్తున్న అభివృద్ధిని చూడలేకనే ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై వచ్చిన ఆరోపణలను ఖండిస్తూ సోమవారం చైర్మన్ నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని శంభునికుంట చెరువు పరిధిలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు కబ్జాలు చేస్తున్నారంటూ ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ ఆరోపణలకు రుజువు చూపితే నలభై ఏళ్ల రాజకీయానికి స్వస్తి పలుకుతానని చెప్పారు. పటాన్‌చెరు పట్టణంలోని సాకి చెరువు పరిధిలోని సర్వే నెంబర్ 620లో మాజీ ఎమ్మెల్యే నరసింహారెడ్డితో పాటు బలహీనవర్గాలకు చెందిన 10 ఎకరాల సీలింగ్ పట్టా భూమిని ఎఫ్‌టీఎల్‌లో చూపిస్తూ అప్పటి సర్వే బృందం రిపోర్ట్ ఇచ్చిందని తెలిపారు. ఈ అంశంలోనూ తిరిగి సర్వే చేయాలని ప్రభుత్వానికి అప్పీలు చేశామన్నారు. ఇప్పటికైనా ప్రతిపక్షాలు ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ మున్సిపాలిటీ వైస్‌చైర్మన్ నందారం నరసింహాగౌడ్, పార్టీ మున్సిపల్ అధ్యక్షులు బాల్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మహాసభకు తరలిరావాలి

రామచంద్రాపురం(పటాన్ చెరు): బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా ఈ నెల 25న పటాన్‌చెరులో నిర్వహించనున్న బీఆర్ఎస్ ప్రతినిధుల మహాసభను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు అధికసంఖ్యలో తరలిరావాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ, భారతినగర్, రామచంద్రాపురం డివిజన్ ముఖ్య నాయకుల ప్రత్యేక సమావేశం నిర్వ హించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సింధుఆదర్శరెడ్డి, పుష్పనగేష్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రాగం దేవేందర్‌యాదవ్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా బీరప్పస్వామి కల్యాణోత్సవం

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని అన్నారం గ్రామంలో బీరప్ప కామరాతి దేవతల కల్యాణోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బీరప్పస్వామి సన్నిధిలో నీలం మధు పూజలు: చిట్కుల్ సర్పంచ్ నీలం మధు, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ ప్రవీణ, జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, స్థానిక సర్పంచ్ మురళి, ఆయా పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గొల్లకుర్మల సంక్షేమానికి పెద్దపీట


అల్మాయిపేట ఉత్సవాల్లో ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నిర్వాహకులు

ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

జోగిపేట(అందోల్): గొల్లకుర్మల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని అల్మాయిపేట, పోసానిపేట గ్రామాల్లో బీరప్పస్వామి ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొల్లకుర్మల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మొదటి విడత గొర్రెల పంపిణీ పూర్తయ్యిందని, రెండో విడతలో గొర్రెలను అందించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. బీరప్పస్వామి ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, ఎంపీపీ బాలయ్య, కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు నగేష్, వైస్ఎంపీపీ మహేశ్వర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ ప్రవీణ్, బీఆర్ఎస్ జిల్లా యువజన నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి


మాట్లాడుతున్న ఎంపీపీ కర్ర చాందీబాయి చౌహాన్

నారాయణఖేడ్: ప్రభుత్వ పథకాల అమలుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ కర్ర చాందీబాయి చౌహాన్ అన్నారు. మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ పథకాలను అర్హులైన వారికి ఎంపిక చేయాలని సూచించారు. గ్రామాలు, తండాల్లో తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధిహామీ కూలీలకు రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తమతమ పరిధిల్లో నెలకొన్న సమస్యలను వివరిస్తూ పరిష్కరించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మిబాయి రవీందర్‌నాయక్, మండల పరిషత్తు ఉపాధ్యక్షులు సాయిరెడ్డి పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత


నారాయణఖేడ్: చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 8మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి నారాయణఖేడ్‌లోని క్యాంపు కార్యాలయంలో సోమవారం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనా నజీబ్, జెడ్పీటీసీలు లక్ష్మిబాయి రవీందర్ నాయక్, నర్సింహ్మారెడ్డి, నాయకులు రోషన్‌రెడ్డి, అభిషేక్ షెట్కార్ పాల్గొన్నారు. కంగ్టి మండలం నాగూర్ (బి) గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు విజయ్ ఇల్లు కూలిపోగా బాధితుడు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి తన ఇబ్బందులను వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే తక్షణ సహాయంగా రూ.5వేల నగదును అందజేశారు. ఖేడ్ మండలం జుజాల్‌పూర్ శివారులోని హెచ్‌ఆర్ ప్యాలెస్ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి ప్లీనరీని నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తెలిపారు.

కాలుష్య పరిశ్రమ పనులను నిలిపివేయాలి


నిరసన తెలుపుతున్న ప్రజలు

హత్నూర(సంగారెడ్డి): కాలుష్య పరిశ్రమ పనులను నిలిపివేయాలని మండల పరిధిలోని వడ్డేపల్లితో పాటు పరిసర గ్రామాల ప్రజలు డిమాండ్ చేశారు. పరిశ్రమ పనులు నిలిపివేయాలని కోరుతూ చేపట్టిన నిరసనలు సోమవారంతో 18వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ కాలుష్య కారక పరిశ్రమ నుంచి ఆరు గ్రామాలకు ముప్పు పొంచి ఉందన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే పనులు నిలిపివేయాలని కోరారు. లేనిపక్షంలో నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మచ్చ శశికళ వాసుదేవ రావు, సర్పంచ్ స్వరూప, ఉపసర్పంచ్ సురేష్ గౌడ్, తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణ, ప్రసాద్, పరిసర గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రైతుబీమా చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న జెడ్పీటీసీ

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన రైతు అశోక్ ఇటీవల మృతి చెందాడు. రైతు భీమా పథకం ద్వారా అశోక్‌కు రూ.5లక్షలు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన చెక్కును సోమవారం జెడ్పీటీసీ కుమార్‌గౌడ్ మృతి చెందిన రైతు అశోక్ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్, సర్పంచ్ ఆంజనేయులు, ఏఈఓ అస్మిత, ఉపసర్పంచ్ విజయ్, నాయకులు విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎంఈఓపై చర్యలు తీసుకోవాలి


అదనపు కలెక్టర్ వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సంగారెడ్డి టౌన్: జహీరాబాద్ ఎంఈఓపై కఠిన చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాణిక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో వినతపత్రం అందజేశారు. అనంతరం మాణిక్ మాట్లాడుతూ జహీరాబాద్ మండల పరిధిలో ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించకుండా కొనసాగుతున్న పాఠశాలలపై ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గతంలో జహీరాబాద్ పట్టణంలో ఆక్స్‌ఫర్డ్ స్కూల్ విద్యార్థులు 8మంది పదో తరగతి పరీక్షలు రాయక విద్యకు దూరమయ్యే పరిస్థితి వచ్చిందన్నారు. తక్షణమే ఫిర్యాదులపై నిర్లక్ష్యంగా వ్యవహరించినా ఎంఈఓపై చట్టపరమైన చర్యలు తీసుకొని విద్యార్థుల భవిష్యత్ కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సభ్యులు కాశపాగ్ర ఇమ్మయ్య, దుర్గాప్రసాద్ టీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వేణుగోపాల్, జన జాగృతి సేన అధ్యక్షుడు బంగారు కృష్ణ పాల్గొన్నారు.

జనజాతరను జయప్రదం చేయాలి


కరపత్రం విడుదల చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): ఈ నెల 26న నిర్వహించే పూలే, అంబేడ్కర్ జన జాతరను జయప్రదం చేయాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా సహాయ కార్యదర్శి రాంచందర్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని మారేపల్లిలో జన జాతర కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా రాంచందర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రమాదంలో ఉందన్నారు. కేంద్రంలోని బీజేపీ పాలనతో దేశంలో మతోన్మాదం మితిమీరిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగ పరిరక్షణకు మరో పోరాటం తప్పదన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు బాబురావు, వెంకన్న, అశోక్, ఆనంద్, అనిల్ పాల్గొన్నారు.

జనజాతర కరపత్రం విడుదల

సదాశివపేట(సంగారెడ్డి): సంగారెడ్డిలో ఈనెల 26న నిర్వహించనున్న జ్యోతిరావు పూలే, అంబేడ్కర్‌ల జనజాతర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కేవీపీఎస్ (కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం) జిల్లా అధ్యక్షుడు అశోక్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని కేవీపీఎస్ కార్యాలయంలో మహనీయుల జనజాతర కరపత్రం విడుదల చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు పాల్గొన్నారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న వీఓఏలు

జహీరాబాద్ టౌన్: వీఓఏల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్ డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న వీఓఏలకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో వీఓఏల యూనియన్ నాయకులు అశోక్, అన్నపూర్ణ, మజీద్, లక్ష్మీ, అనుసూజ పాల్గొన్నారు.

ఝరాసంగం(జహీరాబాద్): వీఓఏలు తమ సమస్యలను పరిష్కరించాలని చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. సమ్మెలో భాగంగా సోమవారం ఝరాసంగం ఐకేపీ కార్యాలయం ఆవరణలో ఐకేపీ వీఓఏలు ఒంటికాలుపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐకేపీ వీఓఏలు పాల్గొన్నారు.

అంధత్వ నివారణే లక్ష్యంగా 'కంటి వెలుగు'


కంటి అద్దాలు అందజేస్తున్న పాండురంగారెడ్డి

పటాన్‌చెరు: అంధత్వ నివారణే లక్ష్యంగా ప్రభుత్వం కంటివెలుగు పథకాన్ని ప్రారంభించిందని మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని జయలక్ష్మినగర్ కాలనీలో సోమవారం కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, స్థానిక ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

జహీరాబాద్ టౌన్: చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సంగారెడ్డికి చెందిన ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు రజని అన్నారు. శ్రామిక్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో హౌసింగ్ బోర్డ్ కాలనీ, ఆర్యనగర్ కాలనీలో కొనసాగుతున్న బస్తీ ఈవెనింగ్ లెర్నింగ్ సెంటర్ల ప్రథమ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ రజని మాట్లాడుతూ బడికి దూరమైన పిల్లల్ని బడిలో చేర్పడమే కాకుండా వారి భవిష్యత్‌ను తీర్చిదిద్దడానికి ఈవెనింగ్ లెర్నింగ్ సెంటర్లను నిర్వహించడం అభినందనీయమన్నారు. శ్రామిక్ విజ్ఞాన కేంద్రం ట్రస్ట్, మన లైబ్రరీ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ బడికి దూరమైన పిల్లల్ని డ్రాప్స్ అవుట్స్ ను గుర్తించి వారికి విద్యాబుద్ధులు నేర్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో శ్రామిక్ విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ రాంచందర్, కార్యదర్శి డాక్టర్ శివబాబు, ట్రెజరర్ మహిపాల్, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు టీచర్లు పాల్గొన్నారు.

27న 'నిధి ఆప్ కే నిఖత్'

పటాన్‌చెరు టౌన్: భవిష్యనిధి సంస్థ ద్వారా ప్రతి నెలా సమస్యల పరిష్కారానికి ఫిర్యాదుల్లో భాగంగా నిధి ఆప్ కే నిఖత్ 2.0 ఈ నెల 27న నిర్వహించనున్నట్లు ప్రాంతీయ కమిషనర్ విశాల్ అగ్రవాల్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడు కేంద్రాల్లో మూడు శిబిరాలు ఉదయం 9:30 గంటల నుంచి 5:45 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. రంగారెడ్డి జిల్లా మదీనాగూడ వద్ద హెచ్ఐజీ ఫేజ్–2 ఉషోదయ ఎన్‌క్లేవ్ సొసైటీ, సంగారెడ్డి జిల్లాకు గాను ఐడీఏ బొల్లారం సాయిబాబ టెంపుల్ ఫంక్షన్‌హాల్, మెదక్ జిల్లాకు సంబంధించి సంగారెడ్డి మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా నెలలో ఉద్యోగ విరమణ పొందుతున్న ఈపీఎఫ్ చందాదాడులకు ప్రాంతీయ కమిషనర్ చేతుల మీదుగా పింఛను మంజూరుపత్రాలను అందజేయనున్నట్లు వివరించారు. భవిష్యనిధి సమస్యలు ఉన్నవారు పైమూడు కేంద్రాల్లో హాజరై సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

29వరకే కొనుగోలు కేంద్రం

రాయికోడ్(అందోల్): మండల కేంద్రం రాయికోడ్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డులో వరం రైతు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ఈ నెల 29వ తేదీ వరకే కొనసాగుతుందని ఆ సంఘం నాయకులు వీరారెడ్డి, తుకారామ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు తమ వద్ద ఉన్న శనగలను సకాలంలో కేంద్రానికి తీసుకువచ్చి విక్రయించుకోవాలని, క్వింటాలు శనగల ధర రూ.5,335 మెరుగైన ధర పొందాలని సూచించారు.

సంక్షిప్త వార్తలు

◆ సీసీ రోడ్డు పనులు ప్రారంభం



మునిపల్లి(అందోల్): మండల పరిధిలోని అంతారం గ్రామంలో ఉపాధిహామీ పథకంలో భాగంగా ఎంపీపీ శైలజాశివశంకర్, జెడ్పీటీసీ మీనాక్షిసాయికుమార్ రూ.15లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ సహకారంతో అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అంతారం సర్పంచ్ శంకర్, ఎంపీడీఓ అంజలిదేవి, గ్రామ కార్యదర్శి శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

◆ ఇంటి వద్ద పిల్లలను చదివించాలి

మునిపల్లి(అందోల్): వేసవి సెలవుల్లో భాగంగా పిల్లలను ఎండలో తిరగకుండా ఇంటి వద్ద చదివించాలని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఖమ్రోద్దీన్ అన్నారు. సోమవారం మండలంలోని ఖమ్మంపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ నర్సింలు, ఉపాధ్యాయులు ప్రీతి, వినయ్, గోపాల్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

◆ పంట నష్టపరిహారం చెల్లించాలి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఇటీవల కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలని మంజీర రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మలపల్లి పృథ్వీరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని కొల్కూర్ గ్రామంలో సోమవారం సదాశివుని ఆలయంలో పూజలు నిర్వహించి రైతులతో మాట్లాడారు. పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. రైతులకు రుణమాఫీ చేయడంతో పాటుగా సబ్సిడీపై యాంత్రీకరణ పరికరాలను అందజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సంగిశెట్టి, శేఖర్, జలీల్, మస్తాన్, రవీందర్, మల్లన్న పాల్గొన్నారు.

◆ నేటి నుంచి వేసవి పిల్లల శిబిరం

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని శ్రామిక్ విజ్ఞాన భవనంలో మంగళవారం నుంచి 'మన లైబ్రరీ' ఆధ్వర్యంలో వేసవి పిల్లల శిబిరం ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు వైద్యులు విజయలక్ష్మి, శివబాబు సోమవారం ఒక ప్రకనటలో పేర్కొన్నారు. ఈ నెల 29 వరకు ఐదు రోజులు పాటు శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. శిబిరంలో పిల్లలతో కథలు చెప్పించడం, రాయించడం, మట్టితో బొమ్మలు, పేపర్‌తో కళాకృతుల తయారీ, సులభ గణితం, సరదా సైన్స్, డ్రాయింగ్, పెయింటింగ్ తదితర అంశాలపై నిపుణుల ద్వారా శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు.

◆ ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తా

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని బీసీ కాలనీలో నిర్మిస్తున్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ నిర్మాణానికి గడ్డపోతారం సర్పంచ్ ప్రకాశ్‌చారి దంపతులు రూ.లక్ష విలువ చేసే నిర్మాణానికి అవసరమయ్యే వస్తువులను అందజేస్తామని ప్రకాశ్‌చారి హామీనిచ్చారు. ఈ సందర్భంగా అలయ నిర్వాహకులు భరత్‌చారి ప్రకాశ్‌చారికి కృతజ్ఞతలు తెలిపారు.

◆ పులిహోర, మజ్జిగ పంపిణీ



జోగిపేట(అందోల్): జోగిపేట సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో భగవాన్ సత్యసాయిబాబా ఆరాధన మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బస్టాండ్‌లో ప్రయాణికులకు మజ్జిగ, పులిహోర పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

◆ రూ.20లక్షల నష్టపరిహారం ఇవ్వాలి

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): వెంకటాపూర్ గ్రామ పంచాయతీలో మల్టీ పర్పస్ కార్మికుడిగా పనిచేసే బేగరి మోహన్ ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే మోహన్ మృతి చెందాడన్నారు. దీంతో మృతుడి కుటుంబానికి రూ.20లక్షల నష్టపరిహారాన్ని చెల్లించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

◆ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం, గుమ్మడిదల మండలాలను పటాన్‌చెరు సబ్ రిజిస్ట్రారుకు వర్తింపచేసేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక బీజేపీ నాయకులు సోమవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

◆ బీజేపీని బలోపేతం చేయాలి

జహీరాబాద్: నియోజకవర్గంలో బీజేపీని బలోపేతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు రాంచందర్ రాజనర్సింహా అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు జనార్దన్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, అర్చన సారదా, శ్రీనివాస్ గుప్తా, వీరారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

◆ వైభవంగా బీరప్పస్వామి కల్యాణం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని మద్దికుంట గ్రామంలో బీరప్ప కామ రాతి స్వామి కల్యాణ మహోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణంలో సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి, రాష్ట్ర చేనేత సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ కుమారుడు చింతా సాయినాథ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గడీల రాంరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా కొల్కూర్ గ్రామంలోని సదాశివుని జాతరలో ఎడ్ల బండ్ల ఊరేగింపులో ఎమ్మెల్యే జగ్గారెడ్డి పాల్గొని సందడి చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గడీల రాంరెడ్డి, మండల అధ్యక్షుడు సిద్దన్న, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

◆ ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం

సంగారెడ్డి టౌన్: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సంగారెడ్డి మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం పంచాయతీ గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి ఎంపీడీఓ రవీందర్ మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో పుట్టినరోజు ఆడపిల్లలకు గ్రామపంచాయతీ తరపున జన్మదిన ధ్రువపత్రంతో పాటు సుకన్య సమృద్ధి యోజన పథకంలో భాగంగా పాప పేరు మీద రూ.1116 జమ చేసి ఇస్తామన్నారు. కార్యక్రమంలో మండలంలోని ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

బీరప్ప ఆలయానికి విరాళం అందజేత

సంగారెడ్డి టౌన్ : సంగారెడ్డి మండలంలోని కలబ్‌గురు గ్రామంలో నిర్వహిస్తున్న బీరప్ప మహోత్సవానికి సోమవారం డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి తన వంతుగా రూ.25వేలను ఆలయ కమిటీ నిర్వాహకలకు అందజేశారు. అనంతరం మాణిక్యంను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు.

◆ ప్రైమరీ పాఠశాలలో చేరికలు

మునిపల్లి(అందోల్): మండలంలోని పెద్దచల్మెడ అంగన్‌వాడీ సెంటర్ నుంచి 5 ఏండ్లు పూర్తైన పిల్లలను ప్రైమరీ పాఠశాలలో చేర్పించినట్లు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శైలజ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అజయ్ ప్రేమ్‌జీ, మనోహర్‌రెడ్డి, పద్మ, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి పాల్గొన్నారు.